క్లుప్తంగా

ముగిసిన మౌలాలి స్వామి ఉరుసు



మౌలాలి స్వామి పీరుకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని పోదొడ్డి గ్రామంలో మౌలాలి స్వామి ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. గురువారం గంధం ఊరేగింపుతో ప్రారంభమైన ఉరుసు శనివారం స్వామివారి గుర్రం కొండపైకి ఎక్కడంతో ముగిశాయి. తెల్లవారు జామున ఒంటి గంట ప్రాంతంలో మౌలాలి స్వామి సవారి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. గుర్రం కొండపైకి ఎక్కే సన్నివేశాన్ని చూసేందుకు ప్రజలు తరలిరావడంతో దర్గా ప్రాంగణం కిక్కిరిసింది.

రేపు గడప గడపకు మనప్రభుత్వం

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని 1వ గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించ తలపెట్టినట్లు సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీ ఆర్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి గడపను సందర్శించి సంక్షేమ పథకాల లబ్ధిపై ప్రజలకు వివరిస్తారన్నారు. రెండు రోజులపాటు కార్యక్రమం కొనసాగుతుందని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చిరు ధాన్యాల సాగుతో అధిక లాభాలు

ప్యాపిలి: చిరు ధాన్యాల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని వ్యవసాయాధికారి షేక్షావలి అన్నారు. మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామంలో శనివారం రైతులకు చిరు ధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. సర్పంచ్ రంగస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసి న ఈ కార్యక్రమంలో ఏఓ మాట్లాడారు. చిరు ధాన్యాల సాగుకు పెట్టుబడి వ్యయం చాలా తక్కువగా ఉంటుందన్నారు. రైతులు జొన్న, సజ్జ, రాగి, కొర్ర తదితర 9 రకాల చిరు ధాన్యాల సాగు చేపట్టాలని సూచించారు. కోవిడ్ అనంతరం ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లో చిరు ధాన్యాల ప్రయోజనాలు తెలిసొచ్చిందని, వీటికి అన్ని దేశాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు.

గణితంపై విద్యార్థులకు అవగాహన

కొలిమిగుండ్ల: మండలంలోని అంకిరెడ్డిపల్లె మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు శనివారం రథసప్తమిని పురస్కరించుకొని తరగతి గదిలో గణిత రథం చిత్రం గీసి గణితంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు రథంలో ఒకటి, రెండు ఇలా అంకెలతో పాటు కూడికలు, తీసివేతలు ఏర్పాటు చేశారు. విద్యార్థులతోనే అంకెలతో పాటు ఎక్కాలు పలికించారు. కూడికలు, తీసివేతలు చేయించారు. విద్యార్థులకు గణితం సులభంగా అర్థమయ్యేందుకు రథసప్తమిలో భాగంగా రథం బొమ్మను గీసి వివరించామని ఉపాధ్యాయులు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: ఇండస్ట్రీయల్ సబ్ స్టేషన్‌లో ఆదివారం మరమ్మతుల నేపథ్యంలో టౌన్ ఫీడర్, వాటర్ వర్క్స్ ఫీడర్‌లకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే జగదుర్తి, ఆముకదాడు టౌన్ ఫీడర్‌లకు మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

శ్రీ మద్దిలేటయ్య ఆదాయం రూ.6,82,409

బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయానికి శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ.6,82,409లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. అలాగే అనంతపురం జిల్లా, గుంతకల్ చెందిన రాముడు 400 గ్రాముల వెండి గొడుగును స్వామివారికి బహూకరించారు.

డెయిరీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

బేతంచెర్ల: నోటీసు ఇవ్వకుండా విధుల నుంచి తొలగించిన నంద్యాల జిల్లా విజయ పాల డెయిరీలో పనిచేస్తున్న కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ సత్యదీప్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 18నుంచి 20 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులను తొలగించడం సమంజసం కాదన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళనలు చేపడుతామన్నారు.



రూ. 8 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు



రూ. 17.50 లక్షలతో నిర్మాణపనులు తుది దశకు చేరుకున్న వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనం

అభివృద్ధి బాటలో వెలగటూరు!

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో కోవెలకుంట్ల మండల పరిధిలోని వెలగటూరు గ్రామం అభివృద్ధి బాటలో పయనిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజాసంక్షేమంతోపాటు అభివృద్ధి పరుగులు పెడుతోంది. మూడున్నరేళ్ల కాలంలో ఇప్పటికే రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. తాజాగా మరో కోటి రూపాయాలతో వివిధ పనులు చేపట్టారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ. 35 లక్షలతో పైప్‌లైన్, ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం, రూ. 17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం, నాడు- నేడు పథకం కింద రూ. 16 లక్షలతో ప్రాథమిక పాఠశాల అన్ని హంగులతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అలాగే గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసానికి సమర్పించిన వినతుల మేరకు రూ. 8 లక్షలతోపాటు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి కేటాయించిన రూ. 5 లక్షలతో వివిధ ప్రాంతాల్లో 270 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. వీటితో పాటు మరో రూ. 18 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు.

– కోవెలకుంట్ల



రూ. 35 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు

నేటి నుంచి వన్‌మ్యాన్ కమిషన్ పర్యటన

డోన్ టౌన్ ప్యాపిలి:: డోన్ డివిజన్‌లోని పలు గ్రామాల్లో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు వన్ మ్యాన్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్యాముల్ ఆనంద్ కుమార్ పర్యటించనున్నట్లు ఆర్డీఓ వెంకటరెడ్డి, ప్యాపిలి తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ శనివారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. బెంట ఒరియా, బోయ, వాల్మీకుల సమస్యల అధ్యయనంతో పాటు వారితో సమావేశమై వినతి పత్రాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. 29 ఆదివారం ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు ప్యాపిలి మండలంలోని బోయవాండ్లపల్లె, మానుదొడ్డి, సంజీవరాయపురం(కోట్టాలు)గ్రామాల్లో 11.30 నుంచి 1గంట వరకు డోన్ మండలంలోని చనుగోండ్ల, ధర్మారం గ్రామాల్లో ప్రజలతో సమావేశమై సామాజిక, ఆర్థిక స్థితిగతులపై విచారణ చేస్తారన్నారు. 30వ తేదీ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వమించనున్నట్లు వారు వివరించారు. వాల్మీకుల సమస్యలపై వినతి పత్రాలు స్వీకరిస్తారని తెలిపారు.

ల్యాండ్ కన్వర్షన్ తప్పనిసరి

● ఆర్డీఓ వెంకట రెడ్డి



అవుకులో ల్యాండ్ కన్వర్షన్ భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకట రెడ్డి

అవుకు: వ్యవసాయ భూములను స్థలాలుగా మార్చుకొనుటకు ల్యాండ్ కన్వర్షన్ తప్పనిసరి అని డోన్ ఆర్డీఓ వెంకట రెడ్డి అన్నారు. మండల కేంద్రం అవుకులోని ఈడిగ రాజా, శ్రీనివాసరెడ్డి, కాకర్ల కుమార్, కర్నాటి నరేంద్ర బాబులు, అదే విధంగా గుండ్లశింగవరం గ్రామంలోని ఉమ్మడి ఉసేని రెడ్డి, ఉమ్మడి రామకృష్ణారెడ్డి తమ వ్యవసాయ భూములను స్థలాలుగా మార్చుకునేందుకు గతంలో ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు, డీటి ప్రసాద్ బాబుతో కలిసి అర్జీదారుల భూములను ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ల్యాండ్ కన్వర్షన్ చేసుకునే వ్యక్తులు భూ రికార్డుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ రుసుములు చెల్లించి ల్యాండ్ కన్వర్షన్ చేసుకోకుండా వ్యవసాయ భూములను స్థలాలుగా విక్రయించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంగల్ రెడ్డి, విలేజ్ సర్వేయర్‌లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి

బేతంచెర్ల: జగనన్న లేఔట్ కాలనీల్లో ఇంటి నిర్మాణాలు లబ్ధిదారులు వేగవంతం చేసేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీఓ వెంకటరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, డీటీ సత్యదీప్ ఆధ్వర్యంలో వీఆర్వోలు, సర్వేయర్లతో ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. ఇంటి నిర్మాణాల ప్రగతి పై చర్చించారు. మీ పరిధిలోని గ్రామాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టుకునేలా లబ్ధిదారులను చైతన్యవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా జగనన్న శాశ్వత భూ హక్కు- భూరక్ష పథకం రీ సర్వేకు సిద్ధంగా ఉండాలని, మిగులు భూములను గుర్తించాలని ఆదేశించారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

డోన్ : పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. పట్టణంలోని 13వ సచివాలయ పరిధిలో 18వ వార్డులో కౌన్సిలర్ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలతో లబ్ధిపొందిన వివరాలు తెలిపే బుక్‌లెట్‌లను ఆయా కుటుంబాల సభ్యులకు చైర్మన్ రాజేష్ అందజేశారు. అన్నివర్గాల ఆర్థికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. కులమతాలు, వర్గాలు, రాజకీయ విబేధాలకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశంలో ఏ రాష్ట్రం కూడా అమలుచేయడం లేదన్నారు. అర్హత ఉండి కూడా ప్రభుత్వ పథకాల ఫలాలను పొందలేని వారి వివరాలను సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సేకరించి సత్వర న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, ధారా హరినాథ్‌రెడ్డి, సుంకన్న, రైల్వే నాగేంద్ర, ఆర్ట్ రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కంసలి నాగరాజు, డంకేష్, భాస్కర్, జనార్దన్, దస్తగిరి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

● డ్వామా పీడీ రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రారెడ్డి

బనగానపల్లెరూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. పీడీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు పూర్తయ్యాయని, కూలీలు వలస వెళ్లకుండా సొంత గ్రామాల్లోనే పనులు కల్పించాలన్నారు. ఉపాధి పనికి వచ్చే ప్రతి కూలీకి కనీస వేతనం రూ.257 తగ్గకుండా చూడలన్నారు. అలాగే కూలీల జాబ్ కార్డుతో ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ వారికి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. ప్రజలకు అవసరమైన పనులనే చేపట్టాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ భాస్కర్‌నాయుడు, ఈసీ హరికిశోర్, టీఏలు షబ్బీర్‌నాయక్, హుస్సేన్ బాషా, చాంద్‌బాషా, శ్వేత, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

నమో.. సూర్య దేవాయా!

అవుకు: మండల పరిధిలోని శివవరం గ్రామంలో అతి పూరాతనమైన శ్రీ సూర్య నారాయణ స్వామి దేవాలయంలో శనివారం రథ సప్తమి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. ప్రతిఏటా మాఘసప్తమి రోజున సూర్య భగవానుడిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరిస్తే సకల పాపాలు హరింపబడటమే కాకుండా ఆయురారోగ్యాలతో విరాజిల్లుతారని భక్తుల నమ్మకం. శుక్రవారం అర్ధరాత్రి నుంచే గ్రామంలో వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు, పండితులు స్వామివారికి క్షీరాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చనలు చేసి పట్టు వస్త్రాలతో అలంకరించారు. వేకువ జాము నుంచే సూర్య భగవానుడిని దర్శించుకునేందుకు భక్తులు తరలిరావడంతో ఆలయం ప్రాంగాణం కిటకిటలాడింది. అవుకు సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయ భాస్కర్ రెడ్డి, దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి సతీమణి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, దివంగతనేత చల్లా రామక్రిష్టా రెడ్డి పెద్ద కుమారుడు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు చల్లా విక్రాంత్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేంకటేశ్వర ఆలయంలో ఆండాల్ గోష్టి

డోన్: స్థానిక వేంకటేశ్వర ఆలయంలో శనివారం మహిళా భక్తులు ఆండాల్ గోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. సూర్యోదయం కాగానే సూర్యభగవానుడి సన్నిధిలో ప్రసాదాన్ని స్వయంగా తయారు చేశారు. అనంతరం నైవేద్యాన్ని భూదేవి, గోదాదేవి సమేతుడైన వేంకటేశ్వర స్వామికి నివేదించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాము శర్మ, ధర్మకర్తలు సుబ్బారావు, శ్రీనివాసరావు, రజనీ కుమారి, గోష్టి సభ్యులు రజని, ఉషయశ్రీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజు

బేతంచెర్ల: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు పెట్టుబడులు తగ్గడమే కాకుండా అధిక దిగుబడులు వస్తాయని బనగానపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బాలరాజు, రమణయ్య, ఆదినారాయణ అన్నారు. శనివారం మండల పరిధిలోని గోరుమానుకొండలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఏఓ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకంతో భూమి సారం తగ్గడంతోపాటు పంటలు సైతం విషతుల్యం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామనాథం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి

డోన్ రూరల్ : తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా రైతులను చైతన్యపరచడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమని కమిషనరేట్ వ్యవసాయ అధికారి వీఎస్ సురేష్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొత్తకోట, వెంకటాపురం గ్రామాలలో శనివారం ఏఓ అబ్దుల్‌షఫీ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రక్షక పంటలు అయిన జొన్నలు, ఆముదం, పొద్దుతిరుగుడు సాగు లాభదాయకమని, ప్రశంస పురుగులు, లద్దపురుగుల నుంచి పంటలను కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండల అధ్యక్షుడు చంద్రన్న, విస్తరణ అధికారి చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.



వెంకటాపురం గ్రామంలో పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

కొలిమిగుండ్ల: అందరిని విద్యావంతులను చేయడం ద్వారా సామాజికాభివృద్ధి సాధించవచ్చనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత కల్పించి సమూల మార్పులు చేపడుతుందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పెట్నికోట ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకం కింద రూ.1.53 కోట్లతో జరుగుతున్న అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణ పనులను ఈఈ లక్ష్మీనారాయణ, డీఈ బాల జోజప్పతో కలిసి జెడ్పీ చైర్మన్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు రూపు రేఖలు మారిపోతున్నాయని, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉన్నాయన్నారు. తల్లితండ్రులకు పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫారం, బ్యాగ్ తదితర వస్తువులు అందిస్తుందన్నారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలనే ఉద్దేశంతో ఇటీవల ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేసిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ గుప్త,ఇంజనీరింగ్ అసిస్టెంట్ హరి పాల్గొన్నారు.



అధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

మహనీయుల జీవన విధానాన్ని పాటించాలి



సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మహనీయులు ఆచరించి పాటించిన జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కర్నూలు శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకట రెడ్డి తెలిపారు. మండలంలోని బీరవోలు రామాలయంలో టీటీడీ హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు శనివారం సాయంత్రం ముగిశాయి. భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాలను పాటించి, ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాలన్నారు.

ఈ క్రాప్ నమోదు వేగవంతం చేయాలి

బనగానపల్లెరూరల్: ఈ క్రాప్ నమోదు వేగవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌తో ఈ క్రాప్ నమోదుపై రివ్యూ జరిగింది. ఈ సందర్భంగా ఏఓ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం జొన్నపంట కోత దశలో ఉందని, దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. ప్రతి రైతుకు సంబంధించిన పంటను ఈ క్రాప్ తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రఘువరన్, ఏఈఓ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సుబ్బారెడ్డి

చట్టాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్

కోవెలకుంట్ల: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్ సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఆరికట్ల మల్లికార్జునరెడ్డి, నరసింహులు, ఎస్ఐలు వెంకటరెడ్డి, మౌలానీ, తదితరులు అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి న్యాయమూర్తి మాట్లాడారు. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. పేదవారికి ఉచితంగా న్యాయమందించేందుకు కోర్టుల్లో ప్రత్యేక న్యాయవాదులు ఉన్నారన్నారు. కేసులు సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగేశేషుడు, కాశీం సాహెబ్, ఇంద్రకుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విధులపట్ల అలసత్వం వహిస్తే చర్యలు

ప్యాపిలి: విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డోన్ డిప్యూటీ విద్యాశాఖాధికారి క్రిష్టిఫర్ హెచ్చరించారు. మండల పరిధిలోని మామిళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసులు నాయక్ విధులను నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో డిప్యూటీ విద్యాశాఖాధికారి క్రిష్టిఫర్, ప్రజెంటేషన్ అధికారి ఆదాంబాషా తదితరులు శనివారం ఎంఈఓ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ మేరకు ఆ ఉపాధ్యాయుడి పనితీరు గురించి ఎంఈఓ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉపాధ్యాయుడు శ్రీనివాసులు నాయక్‌ను విచారించారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని ప్రతిరోజూ పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. పనితీరు మారకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



విచారణ చేపడుతున్న డిప్యూటీ విద్యాశాఖాధికారి క్రిష్టిఫర్

అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న

బనగానపల్లె: నియోజకవర్గంలో రబీలో అధిక విస్తీర్ణంలో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం ఎస్సార్‌బీసీ, వ్యవసాయ బోర్ల కింద దాదాపు 6200 హెక్టార్లలో ఈ పంటను సాగు అయ్యింది. ఖరీఫ్‌లో మొక్కజొన్న పంట మంచి దిగుబడి లభించి, క్వింటానికి రూ.2వేలు గిట్టుబాటు ధర లభించడంతో రబీలో ఈ పంట సాగుపై రైతులు మొగ్గు చూపారు. ఈ సంవత్సరం సాగు చేసిన పత్తికి వైరస్ సోకడంతో ఈ పంటను తొలగించి కొందరు రైతులు మొక్కజొన్న సాగు చేశారు. అదే విధంగా ఖరీఫ్‌లో సాగు చేసిన వరిపంట దిగుబడులు వచ్చాక మాగాణి భూముల్లోనూమొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. మొక్కజొన్న పైరు కళకళలాడుతుంది. బనగానపల్లె మండలంలోనే దాదాపు రెండు వేల హెక్టార్లలో మొక్కజొన్నను సాగు అయినట్లు అంచనా.



కళకళలాడుతున్న మొక్కజొన్నపైరు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

కోవెలకుంట్ల: నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంలో మంజూరైన పక్కాగృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి సూచించారు. శనివారం మండలంలోని కలుగొట్ల, పట్టణ శివారులోని ఎస్సార్బీసీ జగనన్న కాలనీల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ బేస్‌మెంట్ దశ వరకు ఇళ్ల నిర్మాణం చేపట్టి బిల్లులు పొందిన లబ్ధిదారులందరూ లింటల్, రూఫ్‌లెవల్ దశ వరకు నిర్మాణాలు చేపట్టి ఉగాది పండగ నాటికి పూర్తి చేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే నోటీసులిచ్చి ఇళ్ల పట్టాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధిక, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



కలుగొట్లలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు